సాక్షి
కామారెడ్డి
మంగళవారం । 15 । జూలై । 2025



సమస్యలను పరిష్కరించాలి

ప్రజావాణిలో నమోదయ్యే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు.

- 8లో ▸



నత్తనడకన మరమ్మతులు

నాగిరెడ్డిపేట మండల కేంద్రంలో బస్టాండ్ మరమ్మతులు నత్తనడకన సాగుతున్నాయి. ప్రయాణికులు ఇబ్బందిపడుతున్నారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
37.5 /22.5

వాతావరణం

ఉదయం ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ జల్లులు కురిసే అవకాశాలున్నాయి. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

'క్రమశిక్షణతో విధులు నిర్వహించాలి'



లింగంపేట: క్రమశిక్షణ, నిబద్ధతతో విధులు నిర్వహించాలని ఎస్పీ రాజేశ్ చంద్ర పోలీసులకు సూచించారు. సోమవారం ఆయన లింగంపేట పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. రోల్ కాల్‌ను పరిశీలించి, హాజరైన సిబ్బంది వివరాలు అడిగి తెలుసుకున్నారు. మానవ వనరులను పూర్తి స్థాయిలో వినియోగించే రోల్ కాల్ ప్రాముఖ్యతను వారికి వివరించారు. దర్యాప్తు ప్రక్రియలో కానిస్టేబుళ్ల పాత్ర అత్యంత కీలకమని, ప్రతి కేసును సమగ్రంగా విచారించి ప్రజలకు న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రతి పోలీస్ అధికారిపై ఉంటుందని పేర్కొన్నారు. ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలన్నారు. బ్లూ కోల్ట్స్, పెట్రోకార్ విధుల్లో ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వీపీవోలు తమకు కేటాయించిన గ్రామాలను తరచూ సందర్శిస్తూ, సమాచార వ్యవస్థను బలోపేతం చేసుకోవాలన్నారు. డయల్ 100 ఫిర్యాదులపై వేగంగా స్పందించి చర్యలు తీసుకుంటూ ప్రజలలో పోలీస్ శాఖపై విశ్వాసం పెరిగేలా చూడాలని సూచించారు.

కాయితీ తండా శివారులో చిరుతల సంచారం

గాంధారి: కాయితీ తండా శివారులోని అటవీ ప్రాంతంలో వారం రోజులుగా చిరుత సంచరిస్తోందని తండావాసులు తెలిపారు. మూడు రోజుల క్రితం పేట్‌సంగెం మాజీ సర్పంచ్ జగ్గుల్ నాయక్‌కు చెందిన రెండు గొర్రె పొట్టేళ్లపై దాడిచేసి ఎత్తుకుపోయిందని పేర్కొన్నారు. మరో రైతుకు చెందిన ఆవుపై దాడి చేసి చంపే ప్రయత్నం చేయగా కాపరులు అరవడంతో చిరుత అడవిలోకి పరుగులు తీసిందని తెలిపారు. ఆవు గొంతుపై తీవ్ర గాయాలయ్యాయన్నారు. అడవిలో రెండు, మూడు చిరుతలు సంచరిస్తున్నాయన్న అనుమానాన్ని వ్యక్తం చేశారు. చిరుతను బంధించాలని కోరుతున్నారు.

జిల్లా వ్యవసాయ అధికారిగా మోహన్‌రెడ్డి



కామారెడ్డి క్రైం: జిల్లా వ్యవసాయ అధికారి తిరుమల ప్రసాద్ నిజామాబాద్ ఆత్మ డైరెక్టర్‌గా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో వికారాబాద్ డీఏవోగా ఉన్న మోహన్‌రెడ్డి బదిలీపై వచ్చారు. సోమవారం బాధ్యతలు స్వీకరించిన అనంతరం నూతన డీఏవో మోహన్‌రెడ్డి కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో బదిలీపై వెళ్తున్న తిరుమల ప్రసాద్ పాల్గొన్నారు.

'ఇందిరమ్మ'లో రాష్ట్రంలో నాలుగోస్థానం

కామారెడ్డి టౌన్: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో కామారెడ్డి జిల్లా రాష్ట్రంలో నాలుగో స్థానంలో ఉందని హౌసింగ్ పీడీ విజయపాల్‌రెడ్డి తెలిపారు. జిల్లాకు మొత్తం 11,618 ఇందిరమ్మ ఇళ్లు మంజూరవగా.. ఇప్పటివరకు 5,435 నిర్మాణాలు ప్రారంభమయ్యాయని పేర్కొన్నారు. 47 శాతం ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించి రాష్ట్రంలో నాలుగో స్థానంలో ఉన్నామని తెలిపారు. ప్రారంభమైనవాటిలో 1,013 బేస్‌మెంట్ లెవల్‌లో ఉండగా.. 65 రూఫ్ లెవల్, 30 స్లాబ్ లెవల్ వరకు పనులు పూర్తయ్యాయని వివరించారు. లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకోవాలన్నారు. క్లస్టర్ ఆఫీసర్లు, మండల స్థాయి అధికారులు నిరంతరం నిర్మాణాలను పర్యవేక్షించాలని సూచించారు.

'దివ్యాంగులకు ఆర్థిక ప్రోత్సాహం'

కామారెడ్డి అర్బన్: దివ్యాంగులకు ఆర్థిక పునరావాస పథకం (ఎకనమిక్ రిహాబిలిటేషన్ స్కీం) కింద జీవనోపాధి అవకాశాలు కల్పించడానికి రుణాలు ఇప్పించనున్నట్లు జిల్లా సంక్షేమాధికారి ప్రమీల ఒక ప్రకటనలో తెలిపారు. 2025–26 ఆర్థిక సంవత్సరానికి గానూ జిల్లాకు 31 యూనిట్లు మంజూరు చేశారని, అర్హులైన దివ్యాంగులు ఆన్‌లైన్‌లో ఈనెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. బ్యాంకు లింకేజీ, బ్యాంకు లింకేజీ లేకుండా రూ. 50 వేల నుంచి రూ.3 లక్షల వరకు రుణాలు మంజూరు చేస్తామని పేర్కొన్నారు.

ఆపరేషన్ టైగర్!

ఉమ్మడి జిల్లా సరిహద్దుల్లో సంచరిస్తున్న పులి జాడ కనుక్కోవడం కోసం అటవీ అధికారులు గాలింపు కొనసాగిస్తున్నారు. రెండు రోజులైనా పులి ఎక్కడుంది, ఎటు వెళ్లిందన్నదానిపై స్పష్టత లేదు. దీంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

- ఎస్ 12 పులి కోసం కొనసాగుతున్న గాలింపు
- అడవిలో ఆరు ట్రాక్ కెమెరాలు ఏర్పాటు
- రెండు డ్రోన్ కెమెరాలతో కదలికలు కనిపెట్టే ప్రయత్నం
- ఎటువైపు వెళ్లిందన్న దానిపై స్పష్టత కరువు
- పులిపై విష ప్రయోగానికి ప్రయత్నించిన నలుగురిపై కేసు





పులి పాదముద్రలను పరిశీలిస్తున్న అటవీ అధికారులు, సిబ్బంది

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : ఉమ్మడి జిల్లా సరిహద్దు అటవీ ప్రాంతంలో సంచరిస్తున్న పెద్దపులి కోసం అటవీ శాఖ ఆపరేషన్ కొనసాగుతోంది. జిల్లా అటవీ అధికారి నిఖిత ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలోని మాచారెడ్డి, కామారెడ్డి, సిరికొండ, ఇందల్వాయి, ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట రేంజ్‌లకు చెందిన అటవీ అధికారులు, సిబ్బంది రెస్క్యూ ఆపరేషన్‌లో పాల్గొంటున్నారు. మూడు బృందాలుగా రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతోంది. రామారెడ్డి, మాచారెడ్డి మండలాల పరిధిలోని రెడ్డిపేట, అన్నారం, ఎల్లంపేట, సిరికొండ మండలంలోని కొండాపూర్, తూంపలి తదితర గ్రామాల పరిధిలోని అటవీ ప్రాంతాలలో గాలిస్తున్నారు.

రాత్రింబవళ్లు రెస్క్యూ ఆపరేషన్...

ఎస్ 12 నంబరుతో పిలవబడే పులి ఇటీవల జిల్లా సరిహద్దుల్లోని సిరికొండ, మాచారెడ్డి, రామారెడ్డి మండలాల సరిహద్దు అటవీ ప్రాంతంలో తిరిగినట్టు అటవీ అధికారులు నిర్ధారణకు వచ్చారు. పులి కదలికలను తెలుసుకునేందుకు ముమ్మరంగా ప్రయత్నిస్తున్నారు. దాని జాడ కనిపెట్టేందుకు మాచారెడ్డి, ఇందల్వాయి, కామారెడ్డి, ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట, సిరికొండ రేంజీలకు చెందిన అటవీ అధికారులు, సిబ్బంది రాత్రింబవళ్లు కష్టపడుతున్నారు. పులి కదలికలను గుర్తించే క్రమంలో అడవిని జల్లెడ పడుతున్నారు. సోమవారం జిల్లా అటవీ అధికారి నిఖిత కూడా అటవీ ప్రాంతానికి వెళ్లి రెస్క్యూ ఆపరేషన్‌ను పరిశీలించారు. డ్రోన్ కెమెరాల ద్వారా పులి కదలికలను తెలుసుకునే ప్రయత్నం చేశారు.

ట్రాక్ కెమెరాల సాయంతో..

పులి కదలికలను కనిపెట్టేందుకు అటవీ ప్రాంతంలో ఆరు ట్రాక్ కెమెరాలను ఏర్పాటు చేశారు. పులి తిరిగిన ప్రదేశానికి రెండు కిలోమీటర్ల రేడియస్‌లో అన్నివైపులా కవరయ్యేలా కెమెరాలు బిగించినట్టు సమాచారం. ఆ ప్రాంతంలో పులి ఉంటే కచ్చితంగా కెమెరాలు ట్రాక్ చేస్తాయని అధికారులు చెబుతున్నారు. అలాగే రెండు డ్రోన్ కెమెరాలతో అడవిలో తిరుగుతూ పులి జాడ కనిపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. ఆదివారం ఉదయం నుంచి అర్ధరాత్రి దాటే దాకా గాలింపు కొనసాగింది. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు సిబ్బంది అటవీ ప్రాంతంలోనే ఉండి పులి జాడ కోసం ప్రయత్నించారు.

అదుపులో ముగ్గురు!

రెడ్డిపేట స్కూల్ తండా పరిధిలోని అటవీ ప్రాంతంలో ఇటీవల ఆవుపై పులి దాడి చేసి చంపేసింది. అయితే ఆవు యజమానితో పాటు మరో ముగ్గురు ఆవుపై పురుగుమందులు చల్లి పులిని మట్టుబెట్టే ప్రయత్నం చేశారని అధికారులు గుర్తించి కేసు నమోదు చేశారు. ఇప్పటికే ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్టు సమాచారం. విష ప్రయోగం నిర్ధారణ కోసం శాంపిళ్లను సేకరించి ఫోరెన్సిక్ పరీక్షలకు పంపించారు.



సిబ్బందికి సూచనలిస్తున్న డీఎఫ్‌వో నిఖిత

పెద్దపులి మొదట వచ్చింది సిరికొండకే..

- నిర్ధారించిన అటవీ శాఖ అధికారులు
- ఇందల్వాయి, నిజామాబాద్ సౌత్ రేంజ్‌లలోనూ అప్రమత్తం

డొంకేశ్వర్(ఆర్మూర్) : మాచారెడ్డి రేంజ్ పరిధిలో ఆవుపై దాడిచేసి చంపిన పెద్దపులి మొదటగా నిజామాబాద్ జిల్లా సిరికొండ రేంజ్‌కే వచ్చినట్లు అటవీ శాఖ అధికారులు నిర్ధారించారు. ఇప్పటికే తాటిపల్లి అటవీ ప్రాంతంలో పెద్దపులి పాద ముద్రలను గుర్తించిన విషయం తెలిసిందే. తాటిపల్లి అటవీలోనే కొన్ని రోజులు పెద్దపులి సంచరించి ఉండొచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. కొండలు, రాళ్ల గుట్టలు ఎక్కువగా ఉండడంతో మాచారెడ్డి అటవీ ప్రాంతం వైపు వెళ్లినట్లు భావిస్తున్నారు. అయితే మాచారెడ్డి రేంజ్‌లో పెద్దపులిపై విష ప్రయోగం జరిగిందన్న వార్తలు రావడం, పలువురిని పోలీసులు అదుపులోకి తీసుకోవడంతో నిజామాబాద్ జిల్లాలో కూడా హాట్ టాపిక్‌గా మారింది. పెద్ద పులి మళ్లీ నిజామాబాద్ జిల్లా వైపు రావొచ్చనే సందేహంతో సిరికొండ, ఇందల్వాయి, నిజామాబాద్ సౌత్ రేంజ్‌లను అప్రమత్తం చేశారు. బీట్ ఆఫీసర్లను టీములుగా విభజించి గస్తీ తిరుగుతున్నారు. అటవీ పరిసర గ్రామాల ప్రజలకు, రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

పెద్దపులి కనిపిస్తే సమాచారం ఇవ్వాలని, ఉచ్చులు, విద్యుత్ తీగలు పెట్టకూడదని అధికారులు సూచిస్తున్నారు. అదే విధంగా నిజామాబాద్ నాగారంలో చిరుత సంచారం నేపథ్యంలో అన్ని రేంజ్‌లలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని అధికారులు ఆదేశాలిచ్చారు.

రెస్క్యూ ఆపరేషన్‌కు ఇబ్బందులు



వర్షాకాలం కావడంతో అడవి పచ్చబడింది. ముళ్ల పొదలు, చెట్లు పెరిగి అడవిలో తిరగడానికి అటవీ అధికారులు, సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. పులిని గుర్తించడం కూడా ఇబ్బందికరంగా మారింది. ఎస్ 12 పులిని కాపాడేందుకు ప్రత్యేక బృందాలు అడవుల్లో తిరుగుతూ దాని కదలికలను పసిగట్టేందుకు శతవిధాలా ప్రయత్నిస్తున్నాయి. పులి ఏ వైపు వెళ్లింది అన్నదానిపై క్లారిటీ రావాల్సి ఉంది. నాలుగైదు దశాబ్దాలుగా జిల్లాలో పులుల సంచారం లేదు. ఇప్పుడు వచ్చిన పులిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది. ప్రజలు అటవీ ప్రాంతానికి వెళ్లొద్దు. పులిపై విష ప్రయోగం జరిగిందా లేదా అనేది ఫోరెన్సిక్ ల్యాబ్ నివేదిక వచ్చాకే చెప్పగలం.

– నిఖిత, డీఎఫ్‌వో, కామారెడ్డి

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్
- నేషనల్ స్టూడెంట్స్ పర్యావరణ్ కాంపిటీషన్ పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్‌లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సంగ్వాన్, అదనపు కలెక్టర్లు విక్టర్, చందర్, అధికారులు

కామారెడ్డి క్రైం : పర్యావరణ పరిరక్షణకు అందరూ కృషి చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో నేషనల్ స్టూడెంట్స్ పర్యావరణ్ కాంపిటీషన్(ఎన్ఎస్‌పీసీ) 2025 పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వాతావరణ మార్పులతో కలిగే ప్రభావాల నుంచి రక్షణ విషయంలో విద్యార్థులు పర్యావరణ నైపుణ్యాలను పెంచుకోవడం, ఆరోగ్యకరమైన జీవన శైలిని అలవర్చుకోవడం ఎంతో ముఖ్యమన్నారు. మొక్కలు నాటడం, నీటి సంరక్షణ, వ్యర్థాలను వేరు చేయడంలాంటి పద్ధతులను ప్రతి విద్యార్థికి అలవాటు చేయాలన్నారు. కేంద్ర విద్య, పర్యావరణ మంత్రిత్వ శాఖల సహకారంతో ఈ పోటీలను 'హరిత్, ద వే ఆఫ్ లైఫ్' అనే నినాదంతో దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్నారన్నారు. 1 నుంచి 5, 6 నుంచి 8, 9 నుంచి 12 వ తరగతి, డిగ్రీ, పీజీ, పరిశోధన విద్యార్థులు, సాధారణ పౌరుల విభాగాల్లో వేర్వేరుగా పోటీలు ఉంటాయన్నారు. రిజిస్ట్రేషన్లకు ఆగస్టు 21 వరకు అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈకో మిత్ర అనే మొబైల్ యాప్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. హిందీ, ఇంగ్లిష్ సహా అనేక భాషలలో క్విజ్ పోటీ అందుబాటులో ఉంటుందన్నారు. మొక్క నాటుతు గానీ, సంరక్షిస్తూ గానీ, వ్యర్థాలను వేరు చేస్తున్న ఫొటో గానీ సెల్ఫీ తీసి తప్పనిసరిగా అప్‌లోడ్ చేయాలని సూచించారు. పాల్గొన్న ప్రతి విద్యార్థికి ఇ–సర్టిఫికెట్ ఇస్తామన్నారు. ఉత్తమ ప్రదర్శన ఇచ్చిన విద్యా సంస్థలకు ప్రత్యేక గుర్తింపు లభిస్తుందన్నారు. అన్ని పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు విక్టర్, చందర్, డీఈవో రాజు, డీఎంహెచ్‌వో చంద్రశేఖర్, ఆర్డీవో వీణ, జిల్లా సైన్స్ అధికారి సిద్ధిరాంరెడ్డి పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలి

కామారెడ్డి క్రైం: మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. మహిళా సాధికారత కేంద్రం, సోనియా శంకర్ ఫౌండేషన్‌ల ఆధ్వర్యంలో బేటీ బచావో బేటీ పడావో పథకంలో భాగంగా మహిళలకు కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని ఇటీవల ప్రారంభించారు. ఇందులో శిక్షణ పూర్తి చేసుకున్న 60 మందికి సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి ప్రమీల, ఐసీడీఎస్ సీడీపీవోలు, సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సీతక్క చొరవ చూపేనా?

- జిల్లాను వేధిస్తున్న సమస్యలు
- ఇన్‌చార్జి మంత్రి పర్యటనపై ప్రజల్లో ఆశలు
- నేడు జిల్లా కేంద్రానికి రాక

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : జిల్లా ఇన్‌చార్జి మంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి సీతక్క తొలిసారి జిల్లాకు రానున్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో వివిధ అంశాలపై నిర్వహించే సమీక్ష సమావేశాల్లో ఆమె పాల్గొననున్నారు. ఇన్‌చార్జి మంత్రిగా తొలిసారి జిల్లాకు వస్తున్న సీతక్కపై జిల్లా ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. జిల్లాలోని సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

సమస్యల తిష్ట..

జిల్లాలో అనేక సమస్యలు తిష్టవేశాయి. వర్షాకాలం ప్రారంభమైనా సరైన వర్షాలు లేకపోవడంతో పలు ప్రాంతాలలో తాగునీటి నెలకొంది. ఇప్పటికీ మిషన్ భగీరథ నీరు చాలా ప్రాంతాలకు సరఫరా కావడం లేదు. జిల్లా కేంద్రంలో మూడు, నాలుగు రోజులకోసారి తాగు నీరు సరఫరా అవుతోంది. చాలా గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్య వేధిస్తోంది. సీజనల్ వ్యాధులు ఇబ్బంది పెడుతున్నాయి. డెంగీ కేసులు పెరుగుతున్నాయి. చాలా ఆస్పత్రుల్లో వైద్యులు, సిబ్బంది లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. యూరియా కొరతతో చాలాచోట్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలోని పలు గ్రామాలు, గిరిజన తండాలకు తారు రోడ్లు లేవు. వర్షం కురిస్తే మట్టి రోడ్లు బురదమయంగా మారి నడవడానికీ ఇబ్బందికరంగా మారుతున్నాయి. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు అనేక సమస్యలు ఉన్నాయి. నిర్మించుకునేందుకు ఆసక్తి ఉన్న వారి పేర్లు జాబితాల్లో రాకపోవడంతో కొందరు నిరాశకు గురవుతున్నారు. ఇళ్ల నిర్మాణానికి అవసరమైన ఇసుక దొరక్క పనులు ముందుకు సాగడం లేదు. కొన్నిచోట్ల ఇళ్ల నిర్మాణానికి అటవీ చిక్కులు ఉన్నాయి. వాటిని పూర్తి స్థాయిలో పరిష్కరించాల్సిన అవసరం ఉంది.



అద్దె భవనాల్లో కార్యాలయాలు..

జిల్లాలో చాలాచోట్ల అంగన్‌వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. కొన్నిచోట్ల నిధులు లేక భవనాల నిర్మాణ పనులు అసంపూర్తిగా మిగిలాయి. అద్దె భవనాల్లో అరకొర వసతుల మధ్య కేంద్రాలు కొనసాగుతున్నాయి. జిల్లాలో పలు అంగన్‌వాడీ టీచర్, ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వాటిని భర్తీ చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

కొత్త పంచాయతీలను ఏర్పాటు చేసినా వాటికి సొంత భవనాలు నిర్మించలేదు. దీంతో వందకు పైగా పంచాయతీలకు సరైన వసతి లేదు. కొన్నిచోట్ల స్కూల్ భవనాల్లో, మరికొన్ని చోట్ల గుడిసెల్లో, ఇంకొన్ని చోట్ల అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. ముఖ్యంగా పంచాయతీలుగా ఏర్పడిన తండాలలో దాదాపు ఏ ఒక్క దానికీ సొంత భవనం లేదు. గతంలో చేసిన పనులకు బిల్లులు రాక తాజా మాజీ సర్పంచ్‌లు ఇబ్బందులు పడుతున్నారు. బిల్లులు మంజూరు చేయాలని కోరుతున్నారు.

స్కూళ్ల పరిస్థితి దయనీయం..

జిల్లాలో గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన స్కూల్ భవనాల నిర్మాణాలు అసంపూర్తిగా మిగిలాయి. బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్లు పనులు ఆపేశారు. దీంతో కొన్నిచోట్ల పాఠశాలలు చెట్ల కింద కొనసాగుతున్నాయి. బిల్లులు చెల్లిస్తే గానీ పనులు ముందుకు సాగే పరిస్థితి లేదు. చాలాచోట్ల సరిపడా తరగతి గదులు లేకపోవడంతో ఇబ్బందుల మధ్య చదువులు కొనసాగుతున్నాయి. ఇన్‌చార్జి మంత్రిగా జిల్లాలో ఆయా సమస్యలపై అధికారులతో సమీక్షించి వాటికి పరిష్కారం చూపుతారని ప్రజలు ఆశిస్తున్నారు.

మంత్రి పర్యటన ఇలా..

కామారెడ్డి టౌన్: జిల్లా ఇన్చార్జి మంత్రి సీతక్క మంగళవారం కామారెడ్డిలో పర్యటిస్తారని జిల్లా అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఆమె ఉదయం 10 గంటలకు జిల్లాకేంద్రంలోని మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలలో వన మహోత్సవంలో పాల్గొంటారని పేర్కొన్నారు. 10.45 గంటలకు కలెక్టరేట్‌లో ఇందిరమ్మ ఇళ్ల పనుల పురోగతి, భూభారతి సమస్యల పరిష్కారం, విత్తనాలు, ఎరువుల సరఫరా, ఆయిల్ ఫార్మింగ్ పురోగతి, టూరిజం ప్రాజెక్టుల అభివృద్ధి, గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరాపై అధికారులతో సమీక్షిస్తారని తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు కలెక్టరేట్‌లో నిర్వహించే మహిళా సదస్సులో పాల్గొంటారని, సాయంత్రం 4.30 గంటలకు హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణం అవుతారని పేర్కొన్నారు.

పుష్కర కాలం తర్వాత..



- రేపే స్నాతకోత్సవం..
- తెయూ కాన్వొకేషన్‌కు చురుగ్గా సాగుతున్న ఏర్పాట్లు

తెయూ(డిచ్‌పల్లి): రాష్ట్రం పేరుతో ఏర్పాటైన తెలంగాణ యూనివర్సిటీలో గత పుష్కర కాలంగా (12 ఏళ్లుగా) విద్యార్థులు, అధ్యాపకులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న రెండో స్నాతకోత్సవాన్ని (కాన్వొకేషన్) బుధవారం నిర్వహించనున్నారు. రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ హాజరు కానుండగా, ముఖ్యఅతిథిగా ఐఐసీటీ మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ శ్రీవారి చంద్రశేఖర్ పాల్గొంటారు. కాన్వొకేషన్ కోసం వర్సిటీ ఉన్నతాధికారులు చురుగ్గా ఏర్పాట్లు చేస్తున్నారు.

విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఏడాదికోసారి కాన్వొకేషన్ నిర్వహించాలని యూజీసీ నిబంధనలు చెబుతున్నాయి. 2006లో తెలంగాణ యూనివర్సిటీ ఏర్పడగా తొలి కాన్వొకేషన్‌ను 13 నవంబర్ 2013లో అప్పటి వీసీ అక్బర్ అలీఖాన్ హయాంలో నిర్వహించారు. ఆ తర్వాత కాన్వొకేషన్ నిర్వహణను మరిచారు. 2018, 2020లో కాన్వొకేషన్ నిర్వహణకు అప్పటి వీసీలు సాంబయ్య, రవీందర్‌గుప్తా నోటీసులు జారీ చేసినప్పటికీ నిర్వహించలేకపోయారు. అయితే గతేడాది అక్టోబర్‌లో వీసీగా బాధ్యతలు స్వీకరించిన యాదగిరి రావు కాన్వొకేషన్ నిర్వహణకు తొలి ప్రాధాన్యం ఇవ్వడంతో నవంబర్‌లో నోటిఫికేషన్ జారీ అయ్యింది.

హైదరాబాద్ నుంచి జర్మన్ హ్యాంకర్

వర్సిటీ క్రీడామైదానంలో కాన్వొకేషన్ నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. వానాకాలం కావడంతో వర్షం, ఈదురు గాలులు వస్తే కార్యక్రమ నిర్వహణకు ఆటంకాలు కలగకుండా హైదరాబాద్ నుంచి ప్రత్యేకంగా జర్మన్ హ్యాంకర్‌ను తెప్పించారు. ఇందులో 500 మంది కూర్చునేందుకు వీలుండగా, రూ.9లక్షలు ఖర్చు చేస్తున్నారు. క్యాంపస్‌లోని రోడ్లకు మరమ్మతులు చేపట్టారు. సూచిక బోర్డులతోపాటు పరిపాలనా భవనానికి వెళ్లే దారిలో 'ఐలవ్ టీయూ' పేరుతో శాశ్వత సెల్ఫీ పాయింట్ ఏర్పాటు చేశారు. అన్ని బోర్డుల వద్ద లాన్స్ ఏర్పాటు చేస్తున్నారు. రాజ్‌భవన్ కార్యాలయం ప్రోటోకాల్ ప్రకారం స్టేజీపై రాష్ట్ర గవర్నర్, ముఖ్యఅతిథి, వీసీ, రిజిస్ట్రార్‌తోపాటు ఏడుగురు డీన్స్ మాత్రమే కూర్చునే అవకాశం ఉంటుంది. విద్యార్థులు, పరిశోధకులు, అధ్యాపకులను పోలీసులు క్షుణ్ణంగా తనిఖీలు చేసి లోనికి అనుమతిస్తారు. సెల్‌ఫోన్లు, బ్యానర్లు, పేపర్లు తీసుకెళ్లే వీలుండదు. పాస్‌లు ఉన్నవారిని మాత్రమే అనుమతిస్తారు.

గ్రాడ్యుయేట్లు, పోస్ట్ గ్రాడ్యుయేట్లు..

తెయూ పరిధిలో 2014 నుంచి 2023 వరకు పోస్ట్ గ్రాడ్యుయేషన్ (పీజీ)లో 15,557 మంది విద్యార్థులు, గ్రాడ్యుయేషన్ (యూజీ) లో 60,660 మంది విద్యార్థులు, బ్యాచిలర్ ఆఫ్ ఎడ్యుకేషన్ (బీఈడీ) లో 10,079 మంది విద్యార్థులు విద్యాభ్యాసం పూర్తి చేశారు.

బెటాలియన్‌లో గార్డ్ ఆఫ్ హానర్

గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ముందుగా డిచ్‌పల్లిలోని టీజీఎస్పీ ఏడో బెటాలియన్‌కు చేరుకుంటారు. గెస్ట్ హౌజ్ వద్ద 104 మంది పోలీసు సిబ్బందితో గౌరవ వందనం (గార్డ్ ఆఫ్ హానర్) స్వీకరిస్తారు. కొద్దిసేపు విశ్రాంతి తీసుకున్న తర్వాత తెయూకు చేరుకుని వర్సిటీలో సైతం పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరిస్తారు. జిల్లా కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి, పోలీస్ కమిషనర్ సాయిచైతన్య కాన్వొకేషన్‌కు హాజరు కానున్నారు. గవర్నర్ భద్రతా సిబ్బందితోపాటు జిల్లా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. వర్సిటీ లో జరుగుతున్న ఏర్పాట్లను వీసీ, రిజిస్ట్రార్‌లతో కలిసి నిజామాబాద్ ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి సోమవారం పరిశీలించారు.

ఆరు విభాగాలతో ప్రారంభమై..

2006లో ఆరు విభాగాలతో ప్రారంభమైన వర్సిటీ ప్రస్తుతం 24 విభాగాల్లో 31 కోర్సులకు విస్తరించింది. డిచ్‌పల్లిలోని ప్రధాన క్యాంపస్‌తోపాటు కామారెడ్డి జిల్లా భిక్కనూర్‌లోని సౌత్ క్యాంపస్, నిజామాబాద్ నగరంలోని సారంగపూర్‌లో ఎడ్యుకేషన్ క్యాంపస్ కొనసాగుతున్నాయి. తెయూకు ఉమ్మడి నిజామాబాద్ జిల్లా పరిధిలో 109 అనుబంధ యూజీ, పీజీ కళాశాలలు ఉండగా, 31కోర్సులకు గాను 19 అప్రూవ్డ్ రెగ్యులర్ కోర్సులు, 12 సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులు, 7 పీహెచ్‌డీ కోర్సులు ఉన్నాయి.

క్లుప్తంగా

కలెక్టర్‌తో భేటీ



కామారెడ్డి టౌన్‌: ఇటీవల ఏజీపీగా నూతనంగా నియమితులైన కె. శ్యామ్‌ గోపాల్‌రావు సోమవారం కలెక్టర్‌ ఆశిష్‌ సంగ్వాన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. మొక్కను అందజేశారు. కేసుల విషయంలో సానుకూలంగా స్పందించి, కోర్టు వ్యవహారాలు చూసుకోవాలని కలెక్టర్‌ సూచించారు.

కలెక్టర్‌ను కలిసిన ఎల్లారెడ్డి ఆర్డీవో



కామారెడ్డి క్రైం: ఎల్లారెడ్డి ఆర్డీవోగా నియమితులైన పార్థసింహారెడ్డి సోమవారం కలెక్టర్‌ ఆశిష్‌ సంగ్వాన్‌ను ఆయన చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. భూ సమస్యల పరిష్కారం, ఇతర సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలుపై దృష్టి పెట్టాలని కలెక్టర్‌ సూచించారు.

ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌ ముట్టడి



కామారెడ్డి టౌన్‌: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌ ముందు ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌ ముట్టడి కార్యక్రమం చేపట్టారు. సోమవారం కొత్త బస్టాండ్‌ నుంచి ర్యాలీగా తరలివచ్చి ధర్నా చేపట్టారు. ఈ ధర్నాకు ముఖ్య అతిథిగా ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు రజనీకాంత్‌ హాజరై ధర్నానుద్దేశించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్స్‌, స్కాలర్‌షిప్‌ బకాయిలు చెల్లించకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతోందని విమర్శించారు. అనంతరం కలెక్టరేట్‌లోకి వెళ్లేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. కొందరిని అనుమతించడంతో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

లీగల్‌ సర్వీసెస్‌ కరపత్రాల ఆవిష్కరణ



మద్నూర్‌(జుక్కల్‌): స్థానిక పోలీస్‌ స్టేషన్‌లో సోమవారం లీగల్‌ సర్వీసెస్‌ అథారిటీ నిర్వహణ కరపత్రాలను సోమవారం ఎస్సై విజయ్‌కొండ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుటుంబ తగాదాలు, సీనియర్‌ సిటిజన్‌ తగాదాలు, చిన్న సమస్యలను పోలీస్‌ స్టేషన్‌ చుట్టూ, కోర్టుల చుట్టూ తిరగకుండా మండల లీగల్‌ సర్వీసెస్‌ అథారిటీ ద్వారా సమస్యలను పరిష్కరించుకోవచ్చని అన్నారు. మద్నూర్‌ జీపీ ఆవరణలో గల కమ్యూనిటీ మీడియేషన్‌ సెంటర్‌లో వలంటీర్లు ఉడుతావార్‌ సురేష్‌, మోరే అశోక్‌లను సంప్రదించాలని సూచించారు. అలాగే న్యాయ సహాయం కోసం 15100 టోల్‌ ఫ్రీ నెంబర్‌కు కాల్‌ చేసి సలహాలు కోరవచ్చన్నారు.

ఒకటికీ రెంటికీ.. బయటికే..

- బిల్లులు రాక మధ్యలో ఆగిపోయిన మరుగుదొడ్ల నిర్మాణం
- నస్రుల్లాబాద్‌ జెడ్పీహెచ్‌ఎస్‌లో ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు
- కన్నెత్తి చూడని అధికార యంత్రాంగం



నస్రుల్లాబాద్‌ జెడ్పీహెచ్‌ఎస్‌లో మధ్యలోనే నిలిచిన మరుగుదొడ్ల పనులు

నస్రుల్లాబాద్‌: మల మూత్ర విసర్జన చేయాలంటే విద్యార్థులు ఆరు బయటకు కి.మీ.ల దూరం వెళ్లాల్సి వస్తోంది. పాఠశాల ప్రాంగణంలో మరుగుదొడ్లు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నా సంబంధిత అధికారులు ఆ వైపు కన్నెత్తి చూడటం లేదు. నస్రుల్లాబాద్‌ జెడ్పీహెచ్‌ఎస్‌ విద్యార్థుల అవస్థలు అంతా ఇంతా కాదు. పాఠశాల చుట్టూ నివాస గృహాలు ఉండటంతో ఊరి బయటకు , అటవీ ప్రాంతానికి సైతం వెళ్తున్నారు.

అర్ధంతరంగా నిలిచిన పనులు

పాఠశాల ప్రాంగణంలో రూ.10 లక్షలతో బాల బాలికలకు మరుగుదొడ్ల నిర్మాణం కోసం నిధులు కేటాయించారు. దీనితో గ్రామానికి చెందిన వ్యక్తి పనులు ప్రారంభించారు. అయితే పిల్లర్ల వరకు పనులు పూర్తయ్యాయి. పనులు జరిగిన వరకు బిల్లులు వస్తే పూర్తి చేయడానికి సిద్ధంగా ఉన్నానని ఆ వ్యక్తి చెబుతున్నారు. పాఠశాలలో 114 మంది విద్యార్థులు ఉండగా అందులో బాలికలు పాత మరుగుదొడ్లు ఉపయోగిస్తున్నారు. కాని బాలురు మాత్రం నిత్యం బహిరంగ ప్రదేశాలకు ,ముళ్ల పొదల్లోకి, గుట్ట ప్రాంతాలకు వెళ్తున్నారు. వర్షాకాలం కాలం కావడంతో జరగకూడని ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిదని తల్లిదండ్రులు భయపడుతున్నారు.

అర్జెంటైనా దూరం పోవాల్సిందే..



పాఠశాలలో అర్జెంట్‌ అవసరం అయినా అంత దూరం పోయే పరిస్థితి ఉంటుంది. కొంత కాలం రోడ్డు ప్రక్కన అవసరం తీర్చుకున్నా నివాస గృహాల వారు అభ్యంతరం తెలపడంతో ఊరి చివరకు వెళ్తున్నాం.

– అఖిల్‌, 10వ తరగతి

మూత్రశాలలు పూర్తి చేయాలి



పాఠశాలలో మూత్ర శాలలు పనులు ప్రారంభం చూసి సంతోషపడ్డాం. కాని మార్చిలో నిలిచిన పనులు ఇంకా ప్రారంభం కాలేదు. కనీస అవసరాలకు కూడా దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. సంబంధిత అధికారులు స్పందించాలని కోరుతున్నాం.

– చరణ్‌, 10వ తరగతి

ప్రజాపాలనకు మద్దతుగా కాంగ్రెస్‌లోకి రండి



కాంగ్రెస్‌లో చేరిన తిప్పాపూర్‌ బీజేపీ, బీఆర్‌ఎస్‌ నేతలు

- ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ

భిక్కనూరు: ప్రజాపాలనకు మద్దతుగా ప్రజలందరూ కాంగ్రెస్‌ పార్టీలో చేరాలని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ అన్నారు. సోమవారం తిప్పాపూర్‌ గ్రామానికి చెందిన బీజేపీ, బీఆర్‌ఎస్‌ నేతలు అనుచరులతో కలిసి కాంగ్రెస్‌ మండలాధ్యక్షుడు భీంరెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌ పార్టీలో చేరారు. వీరందరికి షబ్బీర్‌అలీ కండువాలు కప్పి స్వాగతించారు. ఈ సందర్భంగా షబ్బీర్‌అలీ మాట్లాడుతూ.. ప్రజాపాలనతో ఇందిరమ్మ రాజ్యం సాధ్యమవుతుందన్నారు. ఇచ్చిన ప్రతి హామీని కాంగ్రెస్‌ ప్రభుత్వం నెరవేరుస్తుందన్నారు. రైతు భరోసా పథకం డబ్బులను రికార్డు స్థాయిలో రైతుల ఖాతాల్లో జమ చేసిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వానిదేనన్నారు. గ్రంథాలయ సంస్థ చైర్మన్‌ చంద్రకాంత్‌రెడ్డి, పీసీసీ కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి, కిసాన్‌ విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు కుంట లింగారెడ్డి, మాజీ ఎంపీపీ గాలిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక కొరత రాకుండా చూడాలి

దోమకొండ: ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక కొరత రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ సూచించారు. సోమవారం మండల కేంద్రానికి చెందిన పార్టీ నాయకులు ఆయనను కలిసి ఇందిరమ్మ ఇళ్ల ఇసుక కొరతపై వివరించారు. ఇసుక అనుమతులు ఇవ్వడం లేదని, నిర్మాణాలు ఆలస్యం అవుతున్నాయని వారు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఆయన వెంటనే ఎంపీడీవో ప్రవీణ్‌ కుమార్‌తో పాటు తహసీల్దార్‌ సుధాకర్‌కు ఫోన్‌చేసి మాట్లాడారు. ఇసుక కొరత రాకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో సీడీసీ మాజీ చైర్మన్‌ ఐరేని నర్సయ్య, మాజీ జెడ్పీటీసీ తీగల తిరుమలగౌడ్‌, కాంగ్రెస్‌ పార్టీ పట్టణ అధ్యక్షుడు సీతారాం మధు, సొసైటీ చైర్మన్‌ నాగరాజు రెడ్డి, మాజీ సర్పంచ్‌ నల్లపు శ్రీనివాస్‌ ఉన్నారు.

తుప్పు పడుతున్నా.. వాహనాలపై పట్టింపేది?



నస్రుల్లాబాద్‌: స్థానిక పోలీసు స్టేషన్‌లో స్వాధీనం చేసుకున్న వాహనాలు తుప్పు పడుతున్నాయి. దొంగతనాలు, రోడ్డు ప్రమాదాలు, సరైన ధ్రువ పత్రాలు లేని వాహనాలను పోలీసులు సీజ్‌ చేసి స్థానిక పోలీస్‌స్టేషన్‌ ఆవరణలో ఉంచారు. సంబంధిత వ్యక్తులు రాకపోవడంతో ఎండకు ఎండి, వర్షానికి నానుతున్నాయి. వాటిని వేలం వేయాల్సి ఉన్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి వాహనాలపై సరైన నిర్ణయం తీసుకోవాలని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

మొరం అక్రమ తరలింపుపై చర్యలేవి?



మద్నూర్‌(జుక్కల్‌): మద్నూర్‌, డోంగ్లీ మండలాల్లో జోరుగా సాగుతున్న మొరం, మట్టిదందా అక్రమార్కులకు కాసుల వర్షం కురిపిస్తోంది. మట్టి, మొరంను గుట్టుచప్పుడు కాకుండా రాత్రి వేళల్లో, సెలవుదినాల్లో తరలిస్తున్నారు. మండల కేంద్రంలో గుట్టల నుంచి మొరంను యథేచ్ఛగా తోడేస్తున్నారు. తవ్విన మొరంను ఇళ్ల నిర్మాణాలు, వెంచర్లకు తరలిస్తూ జేబులు నింపుకుంటున్నారు. మట్టిని ఇటుక బట్టీలకు తరలిస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారు. అధికారులు మాత్రం ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న రవీంద్రనాథ్‌ ఆర్య

బాన్సువాడ రూరల్‌: విద్యారంగ సమస్యల పరిష్కారానికి తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్‌) ఎంతగానో కృషి చేస్తోందని సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు రవీంద్రనాథ్‌ ఆర్య అన్నారు. సోమవారం ఆయన మండలంలోని పలు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను సందర్శించి తపస్‌ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టి మాట్లాడారు. ప్రభుత్వం డీఏ, పీఆర్‌సీ పెండింగ్‌లో పెట్టడం అన్యాయమని వెంటనే బకాయిలు చెల్లించాలన్నారు. ఎస్‌జీటీలకు ప్రమోషన్లలో న్యాయం చేయాలని డిమాండ్‌ చేశారు. గురుకుల ఉపాధ్యాయులకు 010 పద్దు ద్వారా జీతాలు చెల్లించాలన్నారు. ఓపీఎస్‌ విధానాన్ని ప్రవేశపెట్టాలన్నారు. జిల్లా ఉపాధ్యక్షులు వేద ప్రకాష్‌, తారాచంద్‌, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మీకు తెలుసా?

ఒంటి చేత్తో నిర్మించిన నల్లూరి గుమిటి



నల్లూరి గుమిటి

శ్రీరాంసాగర్‌ ప్రాజెక్ట్‌ నిర్మాణంలో పాక్షికంగా ముంపునకు గురైన నల్లూర్‌ గ్రామ శివారులోని నల్లూరి గుమిటి ఒంటో చేత్తో నిర్మించినదిగా ప్రసిద్ధి చెందినది.

- నల్లూర్‌ గుమిటి, న్యావనంది తూం, కస్బా(బినోలా) నంది, నీల కంఠేశ్వరా ఆలయాన్ని ఒకరే ఒంటి చేత్తో నిర్మించినట్లు చరిత్రకారులు చెప్తున్నారు.
- నల్లూర్‌ శివారులోని దర్గా నల్లూర్‌ గుమిటిగా ప్రసిద్ధి చెందినది.
- ప్రాజెక్ట్‌ నుంచి లక్ష్మి కాలువ నిర్మాణం ఈ ప్రాంతం నుంచే చేపట్టేవారని, కానీ గుమిటి ఉండటంతో నిర్మాణం నిలిపివేసినట్లు గ్రామస్తులు చెప్తున్నారు.
- ప్రస్తుతం లక్ష్మి కాలువ నీటి సరఫరా కోసం గుమిటికి ఎదురుగా ప్రాజెక్ట్‌లో లక్ష్మి ఎత్తిపోతల పథకం నిర్మించారు.
- నల్లూర్‌ గుమిటి వద్ద ప్రతి శుక్ర, సోమవారాల్లో భక్తులు అత్యధికంగా పూజలు నిర్వహిస్తారు.

– బాల్కొండ

సమస్యలను వెంటనే పరిష్కరించాలి

- కలెక్టర్‌ ఆశిష్‌ సంగ్వాన్‌
- ప్రజావాణికి 95 ఫిర్యాదులు



ప్రజావాణి ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్‌ ఆశిష్‌ సంగ్వాన్‌

కామారెడ్డి క్రైం: ప్రజావాణి ద్వారా దృష్టికి వచ్చే సమస్యలను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్‌ ఆశిష్‌ సంగ్వాన్‌ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 95 ఫిర్యాదులు వచ్చాయి. వాటిలో భూసమస్యలు, ఇందిరమ్మ ఇళ్లు, పింఛన్లు, రేషన్‌ కార్డుల మంజూరుకు సంబంధించిన వినతులు ఎక్కువగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ మాట్లాడుతూ.. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులకు సూచించారు. పెండింగ్‌ ఫిర్యాదులు లేకుండా చూసుకోవాలన్నారు. అదనపు కలెక్టర్లు విక్టర్‌, చందర్‌ నాయక్‌, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మిషన్‌ భగీరథ నీళ్ల కోసం ఫిర్యాదు



కామారెడ్డి అర్బన్‌: మాచారెడ్డి మండలం బంజేపల్లి తండా, సోమారంపేట గ్రామాల్లో మిషన్‌ భగీరథ నీళ్ల సరఫరా కాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, అధికారులకు తెలిపిన ఫలితం లేకుండా ఉందని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు హరిలాల్‌ నాయక్‌ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. మిషన్‌ భగీరథ పైపులైన్ల లీకేజీల మరమ్మతులకు తమ గ్రామ పంచాయతీల్లో నిధులు లేవని బంజేపల్లి, సోమారంపేట గ్రామ పంచాయతీ కార్యదర్శులు అంటుండగా మిషన్‌ భగీరథ అధికారులు స్పందించడం లేదని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు కలెక్టర్‌కు వివరించారు. నేతలు దుంప సురేష్‌, బొడ్డు సంతోష్‌, దుబ్బాక నవీన్‌, తదితరులున్నారు.

పురుగుల నుంచి విముక్తి కల్పించండి



కామారెడ్డి టౌన్‌: సదాశివనగర్‌ మండలం అడ్లూర్‌ ఎల్లారెడ్డి గ్రామంలో గోదాం నుంచి గ్రామంలోకి లక్క పురుగులు విపరీతంగా వస్తున్నాయని అడ్లూర్‌ ఎల్లారెడ్డి గ్రామస్తులు సోమవారం కలెక్టరేట్‌ ముందు నిరసన తెలిపారు. ప్రజావాణిలో కలెక్టర్‌ ఆశిష్‌ సంగ్వాన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. గ్రామంలో పురుగులు అన్నం తినే సమయంలో అన్నం ప్లేట్‌లలో పడుతున్నాయని, చిన్నపిల్లలపై లక్క పురుగులు వాలి గాయాలు చేస్తున్నాయని, దీంతో ఆస్పత్రుల పాలవుతున్నారని వాపోయారు. అధికారులు విచారణ చేపట్టి సమస్యను పరిష్కరించాలని డిమాండ్‌ చేశారు.

పారిశుద్ధ్యం అమలుపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న డీఎల్‌పీవో సురేందర్‌

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): గ్రామాల్లో పారిశుద్ధ్యం అమలుపై దృష్టి సారించాలని ఎల్లారెడ్డి డీఎల్‌పీవో సురేందర్‌ సూచించారు. నాగిరెడ్డిపేట మండల పరిషత్‌ కార్యాలయంలో సోమవారం పంచాయతీ కార్యదర్శులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు.. గ్రామాల్లో మురికికాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలన్నారు. దీంతో పాటు మురికాలువ వెంట, వర్షపునీరు నిల్వ ఉండేచోట బ్లీచింగ్‌పౌడర్‌ చల్లించాలని ఆదేశించారు. గ్రామాల్లో చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల వివరాలతోపాటు లబ్ధిదారుల వివరాలను ఆన్‌లైన్లో నమోదు చేయాలని సూచించారు. ఎంపీడీవో ప్రభాకరచారి తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల సమస్యలను పరిష్కరించండి



కామారెడ్డి టౌన్‌: మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని తెలంగాణ మత్స్యకారులు, మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎల్‌.బాలకృష్ణ డిమాండ్‌ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సదస్సుకు అతిథిగా హాజరై మాట్లాడారు. వర్షాకాలం సీజన్‌ ప్రారంభమై రెండు నెలలు కావస్తున్నా ఇప్పటికి ప్రభుత్వం ఉచిత చేప, రొయ్య పిల్లల పంపిణీ విషయంలో నిర్లక్ష్యం చేస్తోందని మండిపడ్డారు. జల వనరులకు సరిపడేంత చేప, రొయ్య పిల్లలను కొనుగోలు కోసం ప్రతి మత్స్య సొసైటీల ఖాతాలో నగదు జమ చేయాలని డిమాండ్‌ చేశారు. వృత్తి సంఘాల జిల్లా కన్వీనర్‌ వెంకట్‌గౌడ్‌, నాయకులు జగదీష్‌, బాలమణి, మోతిరాం పాల్గొన్నారు.

‘మొక్కలను దత్తత తీసుకొని రక్షించుకుందాం’



బిచ్కుంద(జుక్కల్‌): నాటిన మొక్కలను ప్రతిఒక్కరు దత్తత తీసుకొని రక్షించుకుందామని ఏఎంసీ చైర్మన్‌ కవిత పిలుపునిచ్చారు. సోమవారం మార్కెట్‌ యార్డు ఆవరణలో మొక్కలు నాటి మాట్లాడారు. మనం ప్రకృతిని కాపాడితే అందరు ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. రైతులు పొలాల గట్లపై మొక్కలు నాటాలని కోరారు. వైస్‌ ఏఎంసీ చైర్మన్‌ శంకర్‌ పటేల్‌, సీనియర్‌ నాయకులు మల్లికార్జునప్ప షెట్కార్‌, నాగ్‌నాథ్‌, వెంకట్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

క్రైం కార్నర్‌

ఆర్‌ఎంపీ ఆత్మహత్య

నిజాంసాగర్‌(జుక్కల్‌): జుక్కల్‌ మండలం మహమ్మదాబాద్‌ గ్రామానికి చెందిన మోరె గణేశ్‌(38) అనే ఆర్‌ఎంపీ ఆదివారం ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై నవీన్‌ చంద్ర తెలిపారు. భార్యాభర్తల మధ్య చిన్న పాటి మనస్పర్థలలో మానసిక వేదనకు గురైన గణేశ్‌ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకున్నాడన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అప్పుల బాధతో ఒకరు..

రుద్రూర్‌: కోటగిరి మండలం వల్లభాపూర్‌ గ్రామానికి చెందిన మేకల హన్మాండ్లు (30) చికిత్స పొందుతూ జిల్లా ఆస్పత్రిలో మృతి చెందినట్లు ఎస్సై సునీల్‌ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కూలి పనులు చేస్తూ జీవించే హన్మాండ్లు అప్పులు పెరిగి పోవడంతో ఈ నెల 13న సాయంత్రం గుర్తు తెలియని పురుగుల మందు తాగాడు. గుర్తించిన కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం నిజామాబాద్‌లోని జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడి భార్య గంగామణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



ఆర్మూర్‌టౌన్‌: పట్టణంలోని కెనాల్‌ కట్ట సమీపంలో సోమవారం గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్‌ తెలిపారు. మృతుడి వయస్సు సుమారు 50 సంవత్సరాలు ఉంటుందని, దేహంపై తెల్లటి రంగు టీషర్టు, కాకి కలర్‌ ప్యాంట్‌ ఉందన్నారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రిలో ఉంచామని, వ్యక్తి గురించి ఎవరికైనా సమాచారం తెలిస్తే పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని తెలిపారు.

స్నూకర్‌ షాపుపై పోలీసుల దాడి

ఖలీల్‌వాడి: నగరంలోని ఒకటో టౌన్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో స్నూకర్‌ షాపుపై ఆదివారం అర్ధరాత్రి సీసీఎస్‌ పోలీసులు దాడి చేశారు. ఈ షాపులో గత కొన్ని రోజుల నుంచి బెట్టింగ్‌ దందా సాగిస్తున్నారనే ప్రచారం జరుగుతున్నట్లు సమాచారం రావడంతో సీసీఎస్‌ పోలీసులు దాడులు చేశారు. నలుగురిని అరెస్ట్‌ చేసి, వారి నుంచి రూ. 2,500 స్వాధీనం చేసుకొని ఒకటో టౌన్‌ పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపారు.

డ్రంకెన్‌ డ్రైవ్‌లో ఒకరికి జైలు

బాల్కొండ: మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడిన మెండోరా మండల కేంద్రానికి చెందిన వేముల సాయిలుకు ఆర్మూర్‌ కోర్టు మెజిస్ట్రేట్‌ గట్టు గంగాధర్‌ సోమవారం రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు బాల్కొండ ఎస్సై శైలెందర్‌ తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బైక్‌ అదుపుతప్పి యువకుడి మృతి



రంజిత్‌ (ఫైల్‌)

డిచ్‌పల్లి: డిచ్‌పల్లి మండలం ఘన్‌పూర్‌ గ్రామానికి చెందిన ఒడ్డెపల్లి రంజిత్‌ (29) బైక్‌పై అదుపుతప్పి పక్కనే ఉన్న డ్రైనేజీలో పడి మృతి చెందినట్లు ఎస్సై ఎండీ షరీఫ్‌ సోమవారం తెలిపారు. ఒడ్డెపల్లి రాజలింగంకు నలుగురు కొడుకులు, ఒక కూతురు ఉన్నారు. కూతురుతోపాటు ఇద్దరు కొడుకులకు గతంలోనే పెళ్లిళ్లు జరిగాయి. మూడో వాడైన రంజిత్‌ 5 సంవత్సరాలుగా దుబాయ్‌కు వెళుతున్నాడు. పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకొని వారం రోజుల క్రితం ఇంటికి వచ్చాడు. ఆదివారం సాయంత్రం బైక్‌పై బయటికి వెళ్లాడు. అర్ధరాత్రి సుమారు 12 గంటల సమయంలో ఇంటికి తిరిగి వస్తూ గ్రామంలోని సీసీ రోడ్డుపై ఉన్న స్పీడ్‌ బ్రేకర్‌ వద్ద బైక్‌ అదుపుతప్పి పక్కనే ఉన్న డ్రైనేజీలో పడిపోయాడు. తీవ్రగాయాలు కావడంతో కుటుంబీకులు రంజిత్‌ను డిచ్‌పల్లిలోని ప్రభుత్వ 30 పడకల ఆస్పత్రికి, అనంతరం మెరుగైన చికిత్స కోసం జిల్లా కేంద్రంలోని ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తెల్లవారుజామున 3గంటల సమయంలో మృతి చెందాడు. మృతుడి తండ్రి రాజలింగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సిమెంట్‌ బెంచ్‌ పైనుంచి పడి బాలుడు..

నందిపేట్‌(ఆర్మూర్‌): నందిపేట మండల కేంద్రంలోని ప్రయాణ ప్రాంగణంలో ప్రమాదవశాత్తు సిమెంట్‌ బెంచ్‌పై నుంచి పడి 5 నెలల బాలుడు మృతి చెందాడు. ఎస్సై శ్యాంరాజ్‌ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆలూర్‌ మండలం దేగాం గ్రామానికి చెందిన బుడుబుక్కల పోసాని భిక్షాటన చేసేందుకు తన 5 నెలల కొడుకు శ్రీనుతో కలిసి ఆదివారం మధ్యాహ్నం నందిపేటకు వచ్చింది. గ్రామంలో భిక్షాటన అనంతరం రాత్రి ఆలస్యం కావడంతో నందిపేటలోని ఆర్టీసీ బస్టాండులో సిమెంట్‌ బెంచ్‌పై కొడుకుతో సహా నిద్రించింది. తెల్లవారుజామున 3 గంటలకు కాలకృత్యాలకు వెళ్లి తిరిగి వచ్చేలోపు బాలుడు బెంచ్‌ పైనుంచి కింద పడ్డాడు. తలకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

అన్నారంలో కారు బోల్తా



కారును బయటకు తీస్తున్న స్థానికులు

డొంకేశ్వర్‌(ఆర్మూర్‌): డొంకేశ్వర్‌ మండలం అన్నారం శివారులో ఆదివారం రాత్రి మారుతి స్విఫ్ట్‌ కారు అదుపుతప్పి బోల్తా కొట్టింది. నిజామాబాద్‌కు చెందిన యువకులు ఎస్సారెస్పీ బ్యాక్‌ వాటర్‌ ప్రాంతానికి వచ్చి ఇంటికి తిరిగి వెళ్తుండగా ఈ ఘటన జరిగింది. అతి వేగంతో కారును నడపడంతో మూలమలుపు వద్ద రోడ్డు కనిపించక కారు వ్యవసాయ పొలంలోకి దూసుకెళ్లినట్లు స్థానికులు తెలిపారు. అందులో ఉన్న యువకులకు స్వల్ప గాయాలు కాగా, పొక్లెయిన్‌ సాయంతో కారును బయటికి తీశారు. అన్నారం వద్ద మూల మలుపు కారణంగా తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. టిప్పర్లు, ఆటోలు బోల్తా పడిన ఘటనలున్నాయి. సంబంధిత అధికారులు మాత్రం ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. మరోవైపు పోలీసులు డ్రంకెన్‌ డ్రైవ్‌ తనిఖీలు చేపట్టకపోవడంతో పలువురు వాహనాలను అతివేగంగా నడుపుతున్నారు.

బీసీల ధర్నాను జయప్రదం చేయాలి

నిజాంసాగర్‌(జుక్కల్‌): రిజర్వేషన్ల పేరిట ఎన్నికలు జరపకుండా కాంగ్రెస్‌ పార్టీ, ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని జుక్కల్‌ మాజీ ఎమ్మెల్యే హన్మంత్‌ సింధే ఆరోపించారు. సోమవారం ఆయన సాక్షితో మాట్లాడుతూ..ఈ నెల 15న హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్‌ వద్ద బీఆర్‌ఎస్‌ ఆధ్వర్యంలో బీసీ రిజర్వేషన్ల కోసం ధర్నా నిర్వహిస్తున్నామన్నారు. బీసీల ధర్నాను జయప్రద చేయాలని కోరారు. జుక్కల్‌ నియోజకవర్గంలోని అన్ని మండలాల జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, సొసైటీల చైర్మన్లు ధర్నాకు తరలి రావాలని పిలుపునిచ్చారు.

భక్తిశ్రద్ధలతో పీర్ల పండుగ



మద్నూర్‌(జుక్కల్‌): మండల కేంద్రంలో సోమవారం గ్రామస్తులు పీర్ల పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పీర్లకు ప్రత్యేక పూజలు, నైవేద్యాలు సమర్పించారు. జాతర వెలిసింది. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్తులు పీర్లను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

నకిలీ లేబర్‌ కార్డులను తొలగించాలి

ఎల్లారెడ్డిరూరల్‌: నకిలీ లేబర్‌ కార్డులను తొలగించాలని లేబర్‌ అధికారికి భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు ఎల్లారెడ్డిలో సోమవారం వినతిపత్రం అందించారు. నకిలీ లేబర్‌ కార్డులు పొందిన వారి ద్వారా అర్హులైన వారికి ప్రభుత్వ పథకాలు అందకుండా నష్టపోతున్నారని వారు విన్నవించారు. నకిలీ కార్డులు ఉన్నవారిని తొలగించాలని కోరారు. సాయిబాబా, గగన్‌ తదితరులున్నారు.